

లారీలు రావు.. బస్తాలు కదలవు
ఆలేరు మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఎగుమతిలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటుంది.
- 9లో



ట్రిపుల్‌ ఐటీ పిలుస్తోంది
బాసర ట్రిపుల్‌ ఐటీలో 2023-24 విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాలకు నోటిఫికేషన్‌ విడుదలైంది.
- 10లో

గరిష్టం/కనిష్టం
40°/30°

వాతావరణం
మధ్యాహ్నం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉక్కపోతగా ఉంటుంది. రాత్రిపూట ఈదురుగాలులతో జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్‌

25 మంది విద్యార్థుల ఎంపిక

భువనగిరిటౌన్‌ : బెస్ట్‌ అవైలబుల్‌ స్కీం కింద 25 మంది గిరిజన విద్యార్థులకు యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీవిద్యానికేతన్‌ ప్రైవేట్‌ పాఠశాలలో ప్రవేశం కల్పించినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారీ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌ కాన్ఫరెన్స్‌ హాల్‌లో తల్లిదండ్రుల సమక్షంలో లాటరీ పద్ధతిన విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు



స్పటిక లింగానికి హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు చేపట్టారు. స్వామి వారికి నిత్య పూజలు చేసిన అనంతరం రుద్రహవనం, అభిషేక, అర్చనలు గావించారు. గర్భాలయం, ముఖ మండపంలోని స్పటిక లింగానికి ఆచార్యులు పూజలు చేసి హారతినిచ్చారు. శివ పార్వతుల కల్యాణ వేడుక, సేవోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక యాదాద్రీశుడి ప్రధానాలయంలోనూ నిత్య కైంకర్యాలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం, స్వామివారికి అర్చనలు, అభిషేకం, సుదర్శనహోమం, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు చేపట్టారు. రాత్రి శయనత్సం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

దేవాదాయశాఖ కమిషనర్‌ పూజలు
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దేవాదాయశాఖ కమిషనర్‌ అనిల్‌కుమార్‌ దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆచార్యులు, అధికారులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనం చేసి లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం ఆయన ఈఓ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, కల్పించాల్సిన వాటిపై ఈఓ గీతారెడ్డితో చర్చించారు.

పల్లె ప్రగతి పనుల పరిశీలన



పనులపై చర్చిస్తున్న డీపీఓ సునంద

గుండాల : మండలంలోని సుద్దాల గ్రామంలో పల్లె ప్రగతిలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం జిల్లా పంచాయతీ అధికారి సునంద పరిశీలించారు. పరిశుభ్రత, పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం బ్రిడ్జి పరిసర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. డీపీఓ వెంట సర్పంచ్‌ గూడ ఉపేంద్రరవి, డీఎల్‌పీఓ యాదగిరి, ఎంపీఓ పైళ్ల జనార్దన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధు తదితరులు పాల్గొన్నారు.

మేలుజాతి దూడల ప్రదర్శన



కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన మేలుజాతి ఆవు దూడలు

ఆత్మకూరు(ఎం), గుండాల : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆత్మకూరు(ఎం)మండలం రహీంఖాన్‌పేట, గుండాల మండలం పెద్దపడిశాల గ్రామంలో సోమవారం మేలు జాతి దూడలను ప్రదర్శించారు. కృత్రిమ గర్భాధారణతో మేలు జాతి దూడలు జన్మిస్తాయన్నారు. పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. ఆత్మకూర్‌(ఎం)లో జరిగిన కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్‌ మర్రి మహేష్‌ యాదవ్‌, గోపాల మిత్రలు సురేష్‌, సురేందర్‌, గుండాలలో సర్పంచ్‌ రావుల మల్లేష్‌, ఆల్డా డైరెక్టర్‌ ఇమ్మడి దశరథ గుప్తా, పశు వైద్యాధికారులు ప్రత్యూష, యాకూబ్‌, వీఏ ప్రవీణ్‌, సూపర్‌వైజర్‌ భానుచందర్‌, విజయ, గోపాలమిత్రలు గోవిందు, కిష్టయ్య, నరేష్‌, చంద్రశేఖర్‌, శ్రీను, సోమశేఖర్‌ పాల్గొన్నారు.

తొలిరోజు సగం లోపే..



భువనగిరి మండలం బీఎన్‌ తిమ్మాపురంలో పండుగ వాతావరణంలో ప్రారంభమైన పాఠశాల

48 రోజుల తర్వాత పాఠశాలలు పునఃప్రారంభం
- నామమాత్రంగా విద్యార్థుల హాజరు
- ఎండ తీవ్రత, నవమి సెంటిమెంట్‌తో ఆసక్తి చూపని విద్యార్థులు
- పూలతో స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ పంపిణీ

భువనగిరి : బడిగంట మోగింది. 48 రోజుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. విద్యార్థుల రాకతో స్కూళ్లల్లో సందడి నెలకొంది. మొదటి రోజు పలు చోట్ల పాఠశాలలను మామిడి తోరణాలు, రంగురంగుల కాగితాలతో అలంకరించారు. ఉపాధ్యాయులు పువ్వులు అందజేసి విద్యార్థులకు స్వాగతం పలికారు. కేక్‌లు కట్‌ చేసి పంపిణీ చేశారు. కాగా చాలా పాఠశాలల్లో సమస్యలు దర్శనమిచ్చాయి.

సగంలోపే హాజరు...
జిల్లా వ్యాప్తంగా 921 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 733, కేజీబీవీలు 11, మోడల్‌ స్కూళ్లు 7, టీఎస్‌ఆర్‌ఈఐ సొసైటీ స్కూళ్లు 3, గురుకులాలు 20 ఉన్నాయి. వీటితో పాటు 168 ప్రైవేట్‌ స్కూళ్లు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1,01,727 మంది విద్యార్థులు ఉన్నారు. తొలిరోజు సగం లోపే విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యారు. ఎండతీవ్రత తగ్గకపోవడం, మరోవైపు నవమి సెంటిమెంట్‌ కారణంగా చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపడానికి ఆసక్తి చూపలేదు.



భువనగిరి : పూర్తిగా హాజరుకాని విద్యార్థులు

స్కావెంజర్లు లేక ఇబ్బందులు
పాఠశాలలు పునఃప్రారంభానికి ముందు గ్రామ పంచాయతీ సిబ్బందితో పాఠశాలలను శుభ్రం చేయించారు. కానీ, వారు మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రం చేయలేదు. దీంతో పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. సుమారు 48 రోజుల నుంచి వాటిని శుభ్రం చేయకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. వాటిలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా కొన్ని పాఠశాలల్లో తరగతి గదులను కూడా శుభ్రం చేయలేదు. దీంతో గత్యంతరం లేక విద్యార్థులే శుభ్రం చేసుకున్నారు. ప్రభుత్వ మూడు సంవత్సరాల క్రితం స్కావెంజర్లను తొలగించడంతో గ్రామ పంచాయతీ సిబ్బందితో పాఠశాలలను శుభ్రం చేయిస్తున్న విషయం తెలిసిందే.

ఉపాధ్యాయులేరీ?
జిల్లా వ్యాప్తంగా 712 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. గత విద్యా సంవత్సరం సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో వర్క్‌ సర్దుబాటు ప్రక్రియ నిర్వహించారు. ప్రస్తుతం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో గత విద్యా సంవత్సరం సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులు యథావిధిగా వారివారి పాఠశాలలకు వెళ్లిపోయారు. దీంతో ఆయా పాఠశాలల్లో మళ్లీ ఉపాధ్యాయుల కొరత ఏర్పడనుంది

హాజరైన వారందరికీ బుక్స్‌, యూనిఫామ్‌
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 55,847 మంది విద్యార్థులు ఉన్నారు. యూనిఫాం కోసం 2,75,878 మీటర్ల వస్త్రం వచ్చింది. ఇప్పటి వరకు 85 శాతం కుట్టడం పూర్తయ్యింది. అలాగే 3,47,740 పుస్తకాలు అవసరం కాగా 2,97,750 వచ్చాయి. మొదటి రోజు పాఠశాలలకు హాజరైన విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ పంపిణీ చేశారు.



ఖిలాపై బెలూన్లు ఎగురవేస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్‌ పమేలా సత్పతి, డీసీపీ తదితరులు

భువనగిరి ఖిలా అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి
- పోలీసు శాఖ ఆధ్వర్యంలో 2కే రన్‌




ఖిలాపైకి రన్‌ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్‌, డీసీపీ, అదనపు కలెక్టర్‌ తదితరులు

సాక్షి, యాదాద్రి : భువనగిరి ఖిలాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో తెలంగాణ 2కే రన్‌ నిర్వహించారు. రాచకొండ జాయింట్‌ సీపీ సత్యనారాయణ, కలెక్టర్‌ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారీ తదితర ప్రముఖులు భువనగిరి ఖిలాపైకి ట్రెక్కింగ్‌ చేశారు. మూడు రంగుల బెలూన్లు, జాతీయ పతాకాన్ని ఎగువేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు చేరువ అవుతూ శాంతిభద్రతలను కాపాడడంతో తెలంగాణ పోలీసు ముందున్నదని పేర్కొన్నారు. యువకులు, క్రీడాకారులు, స్థానిక ప్రజలతో కలిసి ఖిలాపై జాతీయ జెండా ఎగురవేయడం సంతోషదాయకమన్నారు. కలెక్టర్‌ పమేలా సత్పతి మాట్లాడుతూ.. భువనగిరి ఖిలాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఖిలా పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు.

జాతీయ జెండా ప్రదర్శన : రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో భువనగిరి ఖిలాపై 200 మీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శించారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల బృందం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్‌ చైర్మన్‌ ఎనబోయిన ఆంజనేయులు, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్‌ అమరేందర్‌, వైస్‌ చైర్మన్‌ చింతల కిష్టయ్య, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ రాజేందర్‌రెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ నాగిరెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి ధనుంజయనేయులు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా..

- రూ.100 కోట్లతో భువనగిరి ఖిలా అభివృద్ధికి సన్నాహాలు
- కోటను సందర్శించిన ఎల్‌అండ్‌టీ కంపెనీ బృందం
- ఏయే పనులు చేపట్టవచ్చని పరిశీలన



భువనగిరి : భువనగిరి ఖిలా అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. కోట అభివృద్ధికి గతంలో పలుమార్లు నిధులు కేటాయించినా పనులు ప్రారంభించలేదు. సమగ్ర అభివృద్ధి ప్రణాళిక(డీపీఆర్‌) తయారు చేసినా అమలుకు నోచుకోలేదు. పర్యాటకులను ఆకర్షించేందుకు దేశంలోని చారిత్రాత్మక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్వదేశీ దర్శన్‌లో భాగంగా భువనగిరి ఖిలా అభివృద్ధికి సంకల్పించి రూ.100 కోట్లు కేటాయించింది.

త్వరలో డీపీఆర్‌ రూపకల్పన
ఏకశిలపై నిర్మించబడిన భువనగిరి కోట.. హైదరాబాద్‌కు సుమారు 45 కిలో మీటర్ల దూరంలో హైదరాబాద్‌ - వరంగల్‌ జాతీయ రహదారి పక్కన ఉంది. ఐదేళ్ల క్రితం భువనగిరి ఖిలా అభివృద్ధికి రూ.15 కోట్లు కేటాయించి రోప్‌ వే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. పనుల నిర్వహణకు కలకత్తాకు చెందిన ఓ సంస్థ ముందుకు వచ్చింది. టెండర్‌ వేసి పనులు ప్రారంభించేందుకు ప్రక్రియ ప్రారంభించింది. కానీ, ప్రభుత్వం కేటాయించిన నిధుల కంటే అధికంగా ఖర్చయ్యే అవకాశం ఉండడంతో పనులు ప్రారంభం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు ఖిలా అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా అమలుకు నోచుకోలేదు. కాగా ఇటీవల కేంద్రం స్వదేశీ దర్శన్‌ కింద రూ.100 కోట్లు కేటాయించి ఖిలాను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి డీపీఆర్‌ రూపొందించే బాధ్యతను ఎల్‌అండ్‌టీ కంపెనీకి అప్పగించింది.

కోటను సందర్శించిన ఎల్‌అండ్‌టీ బృందం
ఎల్‌అండ్‌టీ బృందం సోమవారం భువనగిరి ఖిలాను సందర్శించింది. ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుందని పరిశీలించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి డీపీఆర్‌పై చర్చించారు.

వీటిని అభివృద్ధి చేయాలి
రోప్‌వే ఏర్పాటు చేయాలి. నీటి సౌకర్యం కల్పించాలి. లాడ్జీలు, హోటళ్లు, చిన్న పిల్లల ఆటల పరికరాలు ఏర్పాటు చేయాలి.ఎల్‌ఈడీ లైటింగ్‌, మరుగుదొడ్లు, మూత్రశాలలు, మ్యూజియం, నీటి కొలను అభివృద్ధి వంటి అంశాలను డీపీఆర్‌లో పొందుపర్చనున్నారు.

అందరి అభిప్రాయాలతో డీపీఆర్‌
ఖిలా అభివృద్ధికి కేంద్రంరూ.100 కోట్లు కేటాయించింది. ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, స్థానికులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తాం. అందరి అభిప్రాయాల మేరకు డీపీఆర్‌ రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తాం. డీపీఆర్‌ ఆమోదం పొందగానే పనుల నిర్వహణకు సంబంధించి టెండర్‌ ప్రక్రియ ప్రారంభం అవుతుంది.
–సుమతి, ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధి

ఎన్నికలకు సమాయత్తం!

- ఈవీఎంల ఫస్ట్‌ లెవల్‌ చెకింగ్‌
- కలెక్టర్‌ సమక్షంలో పరిశీలన
- వారం రోజుల పాటు కొనసాగనున్న ప్రక్రియ



ఈవీఎంల పనితీరును పరిశీలించి కలెక్టర్‌కు వివరిస్తున్న ఇంజనీర్లు

సాక్షి, యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. అందులో భాగంగా జిల్లాకు కేటాయించిన ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాల ఫస్ట్‌ లెవెల్‌ చెకింగ్‌ ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. పటిష్టమైన భద్రత మధ్య కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి(రెవెన్యూ) ఆధ్వర్యంలో ఈవీఎంల తనిఖీ మొదలైంది.

శనివారం వరకు పరిశీలన
జిల్లా కేటాయించిన 1014 బ్యాలెట్‌ యూనిట్లు, 793 కంట్రోల్‌ యూనిట్లు, 856 వీవీ పాట్లు మొత్తం 2,663 ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాలను పరిశీలించనున్నారు. సోమవారం మొదలైన మొదటి స్థాయి తనిఖీ శనివారం వరకు కొనసాగనుంది. ఈసీఐఎల్‌ నుంచి వచ్చిన 15 మంది ఇంజనీర్ల బృందం, మండలాల వారీగా డిప్యూటీ తహసీల్దార్లు ఫస్ట్‌ లెవెల్‌ చెకింగ్‌ నిర్వహిస్తున్నారు.

హాజరుకాని రాజకీయ పార్టీల ప్రతినిధులు
ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాలను తనిఖీ చేసే సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలి. తమ అనుమానాలను వ్యక్తం చేయాల్సి ఉంటుంది. కానీ, బీఎస్పీ నాయకుడు భట్టు రామచంద్రయ్య, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆతహార్‌ తప్ప.. బీఆర్‌ఎస్‌, బీజేపీ, కాంగ్రెస్‌, వామపక్ష నాయకులు ఎవ్వరూ హాజరుకాలేదు. ఈవీఎంలు భద్రపర్చిన గదుల తాళాలను రాజకీయ పార్టీల సమక్షంలో మాత్రమే తెరవాలని ఎన్నికల సంఘం నిబంధలు చెబుతున్నాయి. అయితే ఉదయం 11.30వరకు ఏ పార్టీ నాయకుడు రాలేదు. అప్పటికే అక్కడి చేరుకున్న అదనపు శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ, పోలీస్‌ అధికారులు రాజకీయ పార్టీల నాయకుల కోసం ఎదురు చూశారు. చివరకు బీఎస్పీ నాయకుడు భట్టు రామచంద్రయ్య అక్కడికి రావడంతో అధికారులు ఆయన సమక్షంలో గోదాముల తలుపులు తెరిచారు. కూలీలతో ఈవీఎంలను కలెక్టరేట్‌ సమావేశం మందిరంలోకి తరలించారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టేబుళ్లపై ఈవీఎంలను ఉంచి పరిశీలించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ మధ్య చేపట్టారు. అయితే అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఓటింగ్‌ యంత్రాల తనిఖీకి దూరంగా ఉండి ఆ తర్వాత ఆక్షేపణలు చేస్తే అంతగా ప్రాధాన్యం లభించదని ఓ అధికారి చెప్పారు.

పటిష్ట బందోబస్తు
ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాల ఫస్ట్‌ లెవల్‌ చెకింగ్‌ నేపథ్యంలో కలెక్టరేట్‌ ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. పటిష్ట పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌ దిగువనున్న ఫ్లోర్‌లో సమావేశ మందిరం నుంచి గోదాము వరకు పచ్చని కార్పెట్‌ పరిచారు. అలాగే ఈవీఎంలను పరిశీలించే ప్రాంతంలోకి వెళ్లే మార్గంలో మెటల్‌ డిటెక్టర్‌ ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే మీటింగ్‌ హాల్‌లోకి అనుమతించారు.

ఇలా పరిశీలిస్తున్నారు
నూతనంగా వచ్చిన ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాలు సరిగా ఉన్నాయా ఏమైనా డిఫెక్ట్‌ ఉన్నాయా అని ఇంజనీర్ల బృందం పరిశీలిస్తోంది. ఒక్కో యంత్రం బ్యాలెట్‌ యూనిట్‌, కంట్రోల్‌ యూనిట్‌, వీవీ ప్యాట్‌ను మూడు ఒకే చోట ఉంచి పరిశీలిస్తున్నారు. మొదటి స్థాయి తనిఖీ పూర్తయిన అనంతరం సెకండ్‌ లెవల్‌ చెకింగ్‌ చేయనున్నారు.



ఈవీఎంలను పరిశీలించే హాల్‌లోకి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన మెటల్‌ డిటెక్టర్‌

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

- మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశంలో కాంగ్రెస్‌ ఎంపీటీసీల నిరసన



పోడియం ఎదుట ధాన్యం పోసి నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీలు

భువనగిరి : ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్‌ చేస్తూ సోమవారం జరిగిన భువనగిరి మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశంలో కాంగ్రెస్‌ ఎంపీటీసీలు నిరసన తెలిపారు. పోడియం వద్ద ధాన్యం పోసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుందని, వానాకాలం వచ్చినా పూర్తి కావడం లేదన్నారు. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. త్వరితగతిన కొనుగోళ్లు పూర్తి చేయడంతో పాటు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్‌ చేశారు. ఎంపీపీ నరాల నిర్మల స్పందిస్తూ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేస్తామన్నారు. అనంతరం మండల పరిషత్‌ కార్యాలయం, జిల్లా పరిషత్‌ కార్యాలయం మధ్య నిర్మిస్తున్న గోడను తొలగించాలని సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసి కలెక్టర్‌, జెడ్పీ సీఈఓకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బీరు మల్లయ్య, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు పాశం శివానంద్‌, పారిజాత, లలిత,చంద్రకళ, శారద, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

భువనగిరి టౌన్‌: మిషన్‌ భగీరథ కార్మికులకు కనీస వేతన నెలకు రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ మిషన్‌ భగీరథ కాంట్రాక్ట్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు యూనియన్‌ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్‌ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్‌ నాయకులు మాట్లాడుతూ మిషన్‌ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు రూ.10 వేల లోపు జీతం ఇస్తున్నారని, దాన్ని రూ.26 వేలకు పెంచాలన్నారు. కార్మికులకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, వారాంతపు సెలవులు వర్తింపజేయాలని, బోనస్‌ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మీసాల్లేశం ,కుమారస్వామి, బాలరాజు, సంపత్‌ కుమార్‌, ప్రసాద్‌, సురేష్‌, యాదగిరి, సత్యనారాయణ, బొడ్డు రాములు, యూనియన్‌ వివిధ మండలాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాలు, జిరాక్స్‌ సెంటర్లు కిటకిట

యాదగిరిగుట్ట, రామన్నపేట, ఆత్మకూర్‌(ఎం): రాష్ట్ర ప్రభుత్వం బీసీ చేతివృత్తిదారులకు రూ.1 లక్ష ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించడంతో ఆయా కులాల వారు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందుకోసం మీసేవ కేంద్రాలు, జిరాక్స్‌ సెంటర్లకు బారులుదీరుతుండడంతో కిటకిటలాడుతున్నాయి. ఇదే అదనుగా మీసేవ కేంద్రాల నిర్వాహకులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. వీటితో పాటు తహసీల్దార్‌ కార్యాలయాలకు దరఖాస్తుదారులు క్యూ కడుతున్నారు. యాదగిరిగుట్ట తహసీల్దార్‌ కార్యాలయానికి ఈ నెల 2వ తేదీనుంచి సోమవారం వరకు కుల ధ్రువీకరణకు 380, ఆదాయం కోసం 680 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ పత్రాలు 180, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 425 ఆమోదించామని వెల్లడించారు. రామన్నపేట, ఆత్మకూర్‌(ఎం) మండల కేంద్రాల్లోని మీ సేవ కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.



యాదగిరిగుట్టలో జిరాక్స్‌ సెంటర్‌ వద్ద రద్దీ

స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

- రూ.500కే వంటగ్యాస్‌ సిలిండర్‌ ఇస్తాం
- ప్రజలకు హామీ ఇచ్చిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- గుర్రంపోడు మండలంలో సాగిన పాదయాత్ర



పాల్వాయి వద్ద మహిళలతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

గుర్రంపోడు : రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రాగానే యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన పీపుల్స్‌ మార్చ్‌ పాదయాత్ర సోమవారం కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవల్లి నుంచి గుర్రంపోడు మండలంలోని పాల్వాయి, గుడిపల్లి క్రాస్‌రోడ్డు, జూనూతల స్టేజీ మీదుగా తానేదార్‌పల్లి స్టేజీ, చేపూరు స్టేజీ వరకు కొనసాగింది. పాదయాత్రకు పాల్వాయి గ్రామ శివారులో కాంగ్రెస్‌ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

పరిగెత్తుకొచ్చి సమస్యలు తెలియజేసిన కూలీలు
పాదయాత్రలో భాగంగా భట్టి విక్రమార్క రోడ్డు పక్కన నిల్చున్న వృద్ధులు, మహిళలను పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. పొలాల్లో ఉన్న కూలీలు పరిగెత్తుకొచ్చి తమ సమస్యలు ఏకరువు పెట్టారు.తమ బిడ్డలకు ఉద్యోగాలు లేవని, ఇందిరమ్మ కట్టించిన ఇళ్లలోనే ఉంటున్నామని, రుణమాఫీ కాలేదని సీఎల్పీ నేత దృష్టికి తెచ్చారు. డబుల్‌ బెడ్‌రూమ్‌లు ఇవ్వలేదని, రేషన్‌ షాపుల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నారని, గ్యాస్‌ రేటు పెరిగి ఇంత ధర పెట్టి కొనలేక పోతున్నామని పార్వతమ్మ అనే మహిళ చెప్పగా కాంగ్రెస్‌ ప్రభుత్వం త్వరలోనే అధికారంలోకి వస్తుందని అందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని, వంట గ్యాస్‌ రూ.500కే ఇస్తామని చెప్పారు. ఉపాధి కూలీ తమకు డబ్బులు అందడం లేదని చెప్పుకున్నారు. భార్య భర్తల్లో ఒక్కరికే పింఛన్‌ వస్తోందని పాల్వాయి గ్రామానికి చెందిన కళమ్మ, కల్పన, యాదమ్మ చెప్పగా.. త్వరలోనే ఇందిరమ్మ రాజ్యం వచ్చాక భార్యభర్తలకు పింఛను ఇస్తామని హామీ ఇచ్చారు. పాల్వాయిలో రోడ్డు పక్కన ఓ వైద్యశాలలో భట్టి విక్రమార్క వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కుందూరు జైవీర్‌రెడ్డి తానేదార్‌పల్లి స్టేజీ వద్ద భట్టితో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌ నాయక్‌, జిల్లా కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, జాలచినసత్తయ్య యాదవ్‌, కాంగ్రెస్‌ మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ సూదిని జగదీశ్వర్‌రెడ్డి, యాదగిరిగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాయపడిన డ్రైవర్ మృతి


ఇక్రమ్‌ఖాన్ మృతదేహం

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఎం డి.ఇక్రమ్‌ఖాన్(43) ఎల్‌పీజీ గ్యాస్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వృత్తిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో ఈ నెల 10న లారీ లోడ్ చేసుకున్నాడు. హైదరాబాద్‌లో ఖాళీ చేసేందుకు బయలుదేరాడు. ఆ క్రమంలో అదే రోజు రాత్రి 11 : 30 గంటల ప్రాంతంలో చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెం గ్రామ శివారులో అండర్‌పాస్‌పై ట్యాంకర్ మరమ్మతుకు గురవ్వడంతో డ్రైవర్ వాహనాన్ని రోడ్డు ఎడమ వైపున నిలిపి పరిశీలిస్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ వైపుకే వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లారీ డ్రైవర్ ఇక్రమ్ ఖాన్‌ను చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు జీషాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సీత పాండు తెలిపారు.

పాము కాటుతో బాలిక మృతి

ఆలేరురూరల్ : పాము కాటుతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక మృతిచెందింది. ఆలేరు మండలంలోని శారాజీపేటకు చెందిన జెరిపోతుల రమ్య(15) శనివారం గొలనుకొండలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. రాత్రి భోజనం చేశాక రమ్య ఇంటి ముందు వరండాలో పడుకుంది. ఆదివారం ఉదయం నిద్ర లేవగానే నోటినుంచి నురుగల రావడంతో కుటుంబ సభ్యులు ఆలేరులోని వైద్యులకు చూపించారు. పాము కాటుకు గురైందని తెలియడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందింది. సోమవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, రమ్య మృతికి ఆమె చదువుకుంటున్న స్థానిక హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.

● ఖిలాపై 200 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన


భువనగిరి ఖిలాపై 200 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న అధికారులు, యువకులు


జెండా ఎగురవేసిన అనంతరం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, డీసీపీ రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెలంగాణ రన్ సందర్భంగా భువనగిరి ఖిలాపైకి 2కె రన్ నిర్వహించారు. ఖిలాపై జాతీయ జెండా ఎగురవేశారు. ఖిలాపై నున్న రాణిమహల్ చుట్టూ 200 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, రాచకొండ పోలీస్ కమిషనరేట్ జాయింట్ సీపీ సత్యనారాయణతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, యువకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. – సాక్షి, యాదాద్రి

ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం


కూతురుతో సౌజన్య (ఫైల్)

శాలిగౌరారం : తల్లి మందలించిందని కూతురు తన ముగ్గురు పిల్లలతో అదృశ్యమైంది. శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధి బాలిశెట్టిగూడేనికి చెందిన తాటిపాముల శంకరయ్య–పాపమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె సౌజన్యను హైదరాబాద్‌కు చెందిన మల్లెపాక దిలీప్‌కు ఇచ్చి తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిపించారు. ప్రస్తుతం ఈ దంపతులకు మనశ్రీ, మోగనాద్, పాండు సంతానం . 9 నెలల క్రితం భర్తతో గొడవపడిన సౌజన్య ముగ్గురు పిల్లలతో వచ్చి తల్లివద్దనే ఉంటుంది. ఈక్రమంలో ఆదివారం రాత్రి తల్లిబిడ్డలు మాట్లాడుకునే క్రమంలో భర్త వద్దకు వెళ్లాలని కుమార్తె సౌజన్యకు తల్లి పాపమ్మ సూచిస్తూ మందలించింది. ఈ క్రమంలో తల్లీకూతుళ్ల మధ్య స్వల్ప వివాదం జరిగింది. సోమవారం పాపమ్మ ఉపాధిహామీ పనులకు వెళ్లగా సౌజన్య తన ముగ్గురు పిల్లలను తీసుకొని ఇంటినుంచి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన పాపమ్మ కుమార్తె కనిపించకపోవడంతో అల్లుడు, బంధువులకు ఫోన్ చేసి ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. దీంతో పాపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. భువనగిరి మండలం ఝెుర్రంబల్లి గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఝెుర్రంబల్లికి చెందిన గడ్డల కృష్ణస్వామి(53) తన కుమారుడు శ్రీకాంత్‌తో కలిసి ఆదివారం రాత్రి గ్రామ శివారులోని ఐకేపీ కేంద్రానికి వెళ్లారు. యంత్రంలో వరిధాన్యంలోని తాలును తీసే పనికి ఉపక్రమించారు. ఈ క్రమంలో యంత్రం వెనుక భాగంలోని విద్యుత్ వైరు తెగి కృష్ణస్వామికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే శ్రీకాంత్ గమనించి తండ్రిని భువనగిరి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. కాగా, మృతుడి కుటుంబ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ పాశం శివానంద్, తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్, ఆటో ఢీ.. పలువురికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: ట్రాక్టర్, ఆటో ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామ పరిధి పిట్టలగూడెం చౌరస్తా వద్ద సోమవారం రాత్రి జరిగింది. యాదగిరిగుట్ట నుంచి తుర్కపల్లికి వెళుతున్న ట్రాక్టర్ అదే రూట్లో ఎదురుగా వస్తున్న ఓ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ వెంకటేష్, చిన్నం సంతోష, మల్ల మంగమ్మ, యాదగిరి, యాదమ్మకు స్వల్పగాయాలయ్యాయి. వీరు తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో బంధువు అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను భువనగిరి ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురిది యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామం కాగా, మరో ఇద్దరిది మోటకొండూర్ మండలం వర్టూర్ గ్రామం అని సమాచారం

‘రీజినల్’ రైతులకు బెయిల్ మంజూరు

భువనగిరి : ‘రీజినల్ రింగ్ రోడ్డు’ ఆందోళనలో అరెస్ట్ అయి జైల్‌లో ఉన్న రైతులకు సోమవారం భువనగిరి సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రీజినల్ రింగ్ రోడ్డు అలైమెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ గత మే నెల 30న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అందులో పాల్గొన్న ఆరుగురు రైతులపై పోలీసులు 147, 148, 436, 427, 353, 120బి, 149 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇందులో బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు తంగళ్లపల్లి రవికుమార్‌కు ముందస్తు బెయిల్ లభించింది. మిగిలిన గడ్డమీది మల్లేశం, పల్లెర్ల యాదగిరి, అవుశెట్టి నిఖిల్, మల్లెబోయిన బాలును అదే రోజు కోర్టులో హాజరుపరిచి భువనగిరిలోని జైలులో రిమాండ్ చేశారు. అనంతరం భద్రతా కారణాల దృష్ట్యా నల్ల గొండ జైలుకు తీసుకెళ్లగా బెయిల్‌పై విడుదలయ్యారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

అడ్డగూడూరు : అడ్డగూడూరు మండలం మంగమ్మగూడెంలోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. మంగమ్మగూడేనికి చెందిన కడారి భాస్కర్ హైదరాబాద్‌లో ఉంటుండగా ఆయన తల్లిదండ్రులు శాంతయ్య, మల్లయ్య గ్రామంలోని ఇంట్లో నివాసిస్తున్నారు. వృద్ధ దంపతులు ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఇంటి ఆవరణలో పడుకున్నారు. తెల్లవారుజామున టీవీ, కేబుల్ కాలిపోయి పొగ వ్యాపించింది. గమనించిన దంపతులు కేకలు వేయడంతో స్థానికులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అప్పటికే టీవీతో పాటు ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. రెండు రోజుల క్రితం లోకల్ కేబుల్ వారు కొత్త సెటప్‌బాక్స్ అమర్చారు. షార్ట్ సర్క్యూట్‌కు అదే కారణమని శాంతమ్మ, మల్లయ్య ఆరోపించారు.

మునగాల మండలం రేపాలలో..

మునగాల : షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసెలోని గాలి మిషన్ దగ్ధమైంది. ఈ ఘటన మునగాల మండలం రేపాలలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు సొంపంగు నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈదురుగాలికి షార్ట్‌సర్క్యూట్ జరిగి నాగరాజు గాలి మిషన్ దుకాణంలో మంటలు చేలరేగాయి. దీంతో పూరిగుడిసెతో పాటు గాలిమిషన్, ఇతర సామగ్రి కాలిపోయాయి. స్థానికులు స్పందించి మంటలు ఆర్పివేశారు.

చికెన్ సెంటర్ సీజ్

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో దుర్వాసన వస్తున్న కోడి మాంసం విక్రయిస్తున్న స్నేహ చికెన్ సెంటర్‌ను సోమవారం మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. వినియోగదారుల ఫిర్యాదుతో చికెన్ దుకాణాన్ని సందర్శించి కోడి మాంసాన్ని పరిశీలించారు. దుకాణంలో మాంసం దుర్వాసన వస్తుండటంతో నిర్వాహకులను అధికారులు హెచ్చరించారు. నాణ్యమైన కోడి మాంసం మాత్రమే విక్రయించాలని, లేని ఝెుడల ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ హెచ్చరించారు. వారి వెంట మున్సిపల్ సిబ్బంది శ్రావణ్, సంతు, నర్సింహ్మాచారి, నరేందర్, నాగరాజు, రమేష్‌లు ఉన్నారు.

జాతీయ రహదారిపై ఇసుక తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


చిట్యాలలో రోడ్డుకు ఇరువైపులా ఇసుక తొలగిస్తున్న జీఎంఆర్ సిబ్బంది

చిట్యాల : జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు జీఎంఆర్ సంస్థ చర్యలకు ఉపక్రమించింది. మితిమీరిన వేగం, రహదారిపై పేరుకుపోతున్న ఇసుక కారణంగా వాహనాలు అదుపుతప్పడంతో జరుగుతున్న ప్రమాదాలపై ఈ నెల 11న ‘సాక్షి’ దినపత్రికలో ‘ఎగిరి ఢీకొడుతున్నాయ్’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జీఎంఆర్ కాంట్రాక్టర్ హైవేపై పేరుకుపోయిన ఇసుకను సోమవారం ట్రాక్టర్‌తో ఏర్పాటు చేసిన స్పాంజ్ క్లీనర్‌తో పాటు కూలీలతో తొలగించారు.

రహదారిపై గుంతను తప్పించబోయి..

- స్కూల్ బస్సును ఢీకొని యువకుడు మృతి


యాకూబ్‌అలీ (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి) : రహదారిపై అధికారులు నిర్లక్ష్యంగా వదిలేసిన గుంతను తప్పించబోయి ఓ ద్విచక్రవాహనదారుడు స్కూల్ బస్సును ఢీకొని మృతిచెందాడు. తిరుమలగిరిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరిలోని గణేశ్ ఆలయం సమీపంలో సూర్యాపేట – జనగామ ప్రధాన రహదారిపై రెండు నెలల క్రితం మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. అధికారులు అప్పట్లో గుంత తీసి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. గుంతను సగం మాత్రమే పూడ్చి అలానే వదిలేశారు. గుంత కనిపించకుండా స్టాపర్‌ను ఏర్పాటు చేశారు. అయితే, తిరుమలగిరి పట్టణ కేంద్రానికి చెందిన ఎస్.కె.యాకూబ్‌అలీ(57) ఓ బట్టల షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం తిరుమలగిరి క్రాస్ రోడ్డుకు బైక్‌పై వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా గణేశ్ ఆలయం సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సును ఢీకొట్టి ఎగిరి రోడ్డు డివైడర్‌పై పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని స్థానిక పోలీసులు సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలల రక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న మురళీమోహన్

భువనగిరి: బాలలు జాతి సంపద అని, వారి రక్షణ అందరి బాధ్యత అని జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కె.మురళీమోహన్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భువనగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా మార్చాలన్నారు. బాలకార్మిక వ్యవస్థను, బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించడం ద్వారా సత్ఫలితాలను సాధించవచ్చన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్మిక శాఖధికారి మొయినుద్దీన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు శివరాజ్, మల్లేశం, లావణ్య, సుమలత, కొడారి వెంకటేష్, రాంబాయి, శ్రీశైలం పాల్గొన్నారు.

పెళ్లి బృందం వాహనం బోల్తా

- పది మందికి గాయాలు
- మఠంపల్లి మండల పరిధిలో ఘటన

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం రఘునాథపాలెం వద్ద సోమవారం పెళ్లిబృందం వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో పది మందికి గాయాలయ్యాయి. చింతలపాలెం మండలం నక్కగూడేనికి చెందిన పెదపుల్లయ్య తన మనుమరాలు వివాహం ఆదివారం హుజూర్‌నగర్‌కు చెందిన యువకుడితో స్థానికంగా జరిపించారు. అదే రోజు సాయంత్రం వధూవరులతో కుటుంబ సభ్యులు, బంధువులు వరుడి స్వగ్రామం హుజూర్‌నగర్ చేరుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత బంధువులతో కలిసి హుజూర్‌నగర్ నుంచి స్వగ్రామం నక్కగూడేనికి టాటాఏస్ వాహనంలో బయలుదేరారు. రఘునాథపాలెం గ్రామ సమీపంలోకి రాగానే డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. ప్రమాదంలో వాహనంలో ఉన్న పెదపుల్లయ్య, గోపమ్మ, జ్యోతి, రమాదేవి, అవినాష్, చినగోపయ్య, సైదమ్మ, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనాల్లో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో సూర్యాపేట, హైదరాబాదుకు తరలించినట్లు తెలిసింది. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని మఠంపల్లి పోలీసులు తెలిపారు.

ఐదుగురిపై కేసు

చివ్వెంల(సూర్యాపేట): కలెక్టర్ కార్యాలయంలో అనుమతి లేకుండా ధర్నా చేస్తూ దురుసుగా ప్రవర్తించిన ఐదుగురిపై చివ్వెంల పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుమలగిరికి చెందిన ఓర్సు అశోక్, హేమలత, ఓర్సు మల్లయ్య, ఓర్సు శివ, ఓర్సు సూర్యా గ్రామంలో కోళ్లఫాం నిర్వహణకు అనుమతి ఇవ్వడం లేదని సోమవారం కలెక్టరేట్‌లోకి చొరబడే ప్రయత్నం చేశారు. పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు.

ట్రాక్టర్, ఆటో ఢీ.. పలువురికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: ట్రాక్టర్, ఆటో ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామ పరిధి పిట్టలగూడెం చౌరస్తా వద్ద సోమవారం రాత్రి జరిగింది. యాదగిరిగుట్ట నుంచి తుర్కపల్లికి వెళుతున్న ట్రాక్టర్ అదే రూట్లో ఎదురుగా వస్తున్న ఓ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ వెంకటేష్, చిన్నం సంతోష, మల్ల మంగమ్మ, యాదగిరి, యాదమ్మకు స్వల్పగాయాలయ్యాయి. వీరు తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో బంధువు అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను భువనగిరి ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురిది యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామం కాగా, మరో ఇద్దరిది మోటకొండూర్ మండలం వర్టూర్ గ్రామం అని సమాచారం.

డివైడర్‌ను ఢీకొన్న బైక్..
ఆస్పత్రి పాలైన ముగ్గురు యువకులు

శాలిగౌరారం: స్నేహితుడి వివాహానికి హాజరైన ముగ్గురు యువకులు తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. వారిలో శాలిగౌరారం మండలానికి చెందిన ఇద్దరు ఉన్నారు. శాలిగౌరారం మండలం అడ్లూరు గ్రామానికి చెందిన మాచర్ల శ్రీధర్, బాలిశెట్టిగూడేనికి చెందిన పొట్టేటి రఘురామ్, హైదరాబాద్‌కు చెందిన శ్రవణ్ స్నేహితులు. వీరు ఈ నెల 9న ఇబ్రహీంపట్నంలో జరిగిన వివాహానికి హాజరయ్యారు. 10న శ్రీధర్‌కు డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఉండటంతో వివాహమైన స్నేహితుడి ఇంటినుంచి అదే రోజు తెల్లవారుజామున బైక్‌పై ఎల్‌బీనగర్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో మన్నెగూడ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారంతా హైదరాబాద్‌లోనే వేర్వేరు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష పాసైన శ్రీధర్

ప్రమాదంలో గాయపడిన అడ్లూరు గ్రామానికి చెందిన మాచర్ల శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. ఈ నెల మూడవ వారంలో శ్రీధర్ ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంది. కొడుకు పరిస్థితిని చూసి శ్రీధర్ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

పద్మశాలి సంఘం జిల్లా కన్వీనర్‌గా గోవిందరావు

హుజూర్‌నగర్: తెలంగాణ పద్మశాలి సంఘం సూర్యాపేట జిల్లా కన్వీనర్‌గా హుజూర్‌నగర్‌కు చెందిన బొడ్డు గోవిందరావును నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రభాకర్, కె.మురళి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోవిందరావు మాట్లాడుతూ జిల్లా కన్వీనర్‌గా నియమించడం పట్ల సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిధుల లేమితోనే మూసివేత

నల్లగొండ టూటౌన్: విద్యార్థుల కొరత, నిధుల లేమితోనే నల్లగొండలోని డ్వాబ్ సంస్థచే నెలకొల్పిన అంధుల పాఠశాలను మూసివేసినట్లు అంధుల అభివృద్ధి, సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంధుల అభివృద్ధి, పురోగతి కేవలం కాగితాలపైనే చూపిస్తున్నారు తప్ప క్షేత్ర స్థాయిలో కనిపిస్తలేదని వాపోయారు. అంధుల పాఠశాలలను హేతుబద్ధీకరించాలని కోరారు. విద్యార్థులకంటే ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఎక్కువ ఉంటున్నారని, వ్యయభారం అవుతుందని పేర్కొన్నారు.

కుమారుడిని హత్యచేసిన తండ్రి

- డబ్బులు ఇవ్వాలని తండ్రిపై కుమారుడి ఒత్తిడి
- తట్టుకోలేక కొడుకు తలపై రోకలిబండతో మోది, కత్తితో పొడిచి హత్య


సతీష్ (ఫైల్)

సూర్యాపేట క్రైం : కుమారుడిని తండ్రి హత్య చేసిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. సూర్యాపేట పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన చీమల లింగయ్య, మంగమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు సతీష్ (34) సంతానం. ఇద్దరికి వివాహాలు జరిపించారు. లింగయ్య వ్యవసాయంతో పాటు చిన్నాచితకా వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సతీష్ కొంతకాలం గొర్రెల కాపరిగా పనిచేసి జులాయిగా తిరుగుతున్నాడు. కుటుంబంలో గొడవలు జరగడంతో నాలుగేళ్ల క్రితం సతీష్ భార్య విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. సతీష్ పూర్తిగా మద్యానికి బానిసగా మారాడు. డబ్బుల కోసం తల్లిదండ్రులను నిత్యం వేధిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చిన సతీష్ సోమవారం తెల్లవారుజామున డబ్బులు కావాలని తల్లిదండ్రులపై దాడికి పూనుకున్నాడు. తల్లిదండ్రులు అతడికి ఎంత నచ్చచెప్పినా వినిపించుకోలేదు. ఇటీవల ధాన్యం విక్రయించిన డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు.

రోకలిబండతో మోది.. కత్తితో పొడిచి

కుమారుడి వేధింపులు తట్టుకోలేకపోయిన లింగయ్య తీవ్ర ఆగ్రహావేశానికి లోనయ్యాడు. ఇంట్లో ఉన్న రోకలిబండతో సతీష్ తలపై బలంగా మోదడంతో కిందపడిపోయాడు. ఆపై లింగయ్య మటన్ కోసే కత్తితో పలు మార్లు పొడవడంతో సతీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం లింగయ్య నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. సూర్యాపేట సీఐ రాజశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. సతీష్ తల్లి ఫిర్యాదు మేరకు లింగయ్యపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.